# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

మంగళవారం 19, మే 2026




## బక్రీద్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

✪ నిర్మల్ కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్, మే 18, ప్రభాతవార్త:** బక్రీద్ పండుగను జిల్లా వ్యాప్తంగా ముస్లిం సోదరులు ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో జరుపుకునేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బక్రీద్ పండుగ ఏర్పాట్లపై నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఎస్పీ జానకి షర్మిలతో కలిసి ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈద్గాలు, మసీదుల వద్ద ప్రార్థనలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా తాగునీటి సౌకర్యం తప్పనిసరిగా కల్పించాలన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రార్థనల సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖను ఆదేశించారు. పురపాలక, గ్రామపంచాయతీ అధికారులు ఈద్గాల పరిసరాల్లో ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టి, పరిశుభ్ర వాతావరణం కల్పించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని స్పష్టం చేశారు. జిల్లా ప్రజలు అన్ని పండుగలను పరస్పర సహకారం, సామరస్యంతో జరుపుకోవాలని మిగతా 2లో..


### ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు

## యంత్రాంగం సిద్ధంగా వుండాలి

★ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి




**ఆసిఫాబాద్, మే 18, ప్రభాతవార్త** రాష్ట్రంలో వరదలు, అగ్ని ప్రమాదాలు సంబవించేటప్పుడు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా జిల్లా యంత్రంగం సిద్ధంగా వుండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి 18 జిల్లాలో వరదలు, అగ్ని ప్రమాదాలపై నిర్వహించిన మాక్ ఎక్స్ ర్ సైజ్ నమూనా ప్రదర్శన కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాతీయ విపత్తుల నిర్వహణ అథారిటి, రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 13 జిల్లాల్లో వర్షాలు అధికంగా కురిసే అవకాశం వుందన్నారు. భారీ వర్షాల వల్ల నదులు, వాగులు ఉదృతంగా ప్రవహించే గ్రామాలను లోతట్టు ప్రాంతాలను ముంచే త్తుత్తాయని ముందస్తుగా ప్రజలను సురక్షితంగా రక్షించేందుకు అధికార యంత్రంగం ఎన్డిఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్ సిబ్బంది సిద్దంగా వుండాలన్నారు. అడవులలో నిప్పురవ్వలు పడి అడవిలోని విలువైన సంపద కాలి బూడిద అవుతున్నాయని అటవి శాఖ సిబ్బంది అప్రమతంగా ఉండి అడవులను రక్షించుకొవలన్నారు. సమీకృత కలెక్టరేట్ భవనంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి కలెక్టర్ కె హరిత హాజరయ్యారు. జిల్లాలోని సిర్పూర్ మండలంలోని వేంపల్లి అటవీ ప్రాంతంలో అటవీ, రెవిన్యూ, అగ్నిమాపక, రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ అధికారులతో పారు పలు శాఖల అధికారులు పాల్గొని అటవీ అగ్ని ప్రమాదాల నియంత్రణపై మాక్ ఎక్స్ ర్ సైజ్ నమున ప్రదర్శను నిర్వహించడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో విపత్తులు అగ్ని ప్రమాదాలు సంబవిస్తే ఎదురుకోవడానికి అధికార యంత్రాగం సిద్దంగా ఉందని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమములో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.






### మైనారిటీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం

## నిరంతరం కృషి

● మంత్రి జూపల్లి కృష్ణారావు

**నిర్మల్, మే 18, ప్రభాతవార్త:** మైనారిటీల సంక్షేమం, వారి సర్వతోముఖాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. టీఎమ్ఆర్ఈఐఎస్ సమావేశంలో మైనారిటీ విద్యా సంస్థల సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మైనారిటీల అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా మైనారిటీ రెసిడెన్షియల్ విద్యా సంస్థల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, విద్యుత్, వసతి, పారిశుద్ధం తదితర అన్ని మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. అలాగే స్థానికంగా మైనారిటీ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని పేర్కొన్నారు. సమావేశంలో పలువురు ప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై స్పందించిన మంత్రి, సమస్యల పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ వైస్ ఛైర్మన్ మహమ్మద్ ఫహీముద్దీన్ ఖురేషి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, నిర్మల్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, మైనారిటీ సంక్షేమ అధికారి మోహన్ సింగ్, డీఈవో భోజన్న, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అకాల వర్షాలతో తడిసి ముద్దైన మొక్కజొన్న జొన్న

● మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేయాలని రైతుల డిమాండ్

**బజార్‌హత్నూర్, మే 18, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులతో కూడిన అకాల వర్షం కురిసింది. ఈ వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని మొక్కజొన్న, జొన్న పంటలు తడిసి ముద్దయ్యాయి. ఒకపక్క మొక్కజొన్న తూకం (కాటా) పూర్తయినప్పటికీ రవాణాకు తగిన వాహనాలు లేక రైతులు ఇబ్బంది పడుతుండగా, మరోపక్క జొన్న పంటను కాపాడుకోలేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలో సరైన మార్కెట్ యార్డ్ లేకపోవడంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో మొక్కజొన్న, దాని పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశంలో జొన్న పంటను విక్రయించేందుకు రైతులు తెచ్చారు. సరైన వసతులు లేని చోట కొనుగోళ్లు జరపడం వల్లే అకాల వర్షానికి పంట అంతా తడిసిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలానికి ప్రత్యేక మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.



### కుటుంబ కలహాలతో

## భార్యను హత్యచేసిన భర్త



✦ సుత్తితో బాది హత్య చేసిన నిందితుడు

✦ అక్కడిక్కడే మృతిచెందిన భార్య

2 లో..

– చెన్నూరు, మే 18, ప్రభాతవార్త :

## బక్రీద్‌కు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**(మొదటిపేజీ తరువాయి)**

ఆకాంక్షి ంచారు. ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ బక్రీద్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ తరఫున తగిన బందోబస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, అడిషనల్ ఎస్పీ సాయికిరణ్, డీఎస్పీ శ్రీనివాస్, భైంసా మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, నిర్మల్, భైంసా మున్సిపల్ వైస్ చైర్మన్లు అప్పాల గణేష్ చక్రవర్తి, బీబీ కుతీజా సిద్ధిఖీ, వివిధ శాఖల అధికారులు, హిందూ, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

### కుటుంబ కలహాలతో

## భార్యను హత్యచేసిన భర్త

**చెన్నూరు, మే 18, ప్రభాతవార్త :**

మంచిర్యాల జిల్లాలోని చెన్నూరు మండలం ఏళ్లక్కపేట గ్రామానికి చెందిన సల్ల శారద (25)ను సోమవారం రోజున భర్త సుత్తితో మోది హత్యచేసినట్లు బంధువులు తెలిపారు. దీంతో మృతురాలు సంఘటనా స్థలంలోనే మృతిచెందిందని వారు అన్నారు. మృతురాలి తల్లిదండ్రులు మాట్లాడుతూ ఐదు సంవత్సరాల క్రితం సల్ల రమేష్‌కు ఇచ్చి వివాహం చేసినట్లు వారికి ఇద్దరు కుమారుల సంతానం ఉన్నారు. ఒక కుమారుడు మూడు సంవత్సరాలు, రెండవ సంతాన నెలబాబు మాత్రమే ఉన్నట్లు తెలిపారు. ఆది నుండి తమ కూతురిపై అదనపువరకట్నం కోసం వేధింపులకు పాల్పడేవాడని గతంలో పంచాయితులు అయిన సంఘటనలు ఉన్నాయని వారు తెలిపారు. విషయం తెలుసుకున్న మృతురాలి బంధువులు కొంత హింసాత్మక వాతావరణం నెలకొనడంతో లా అండ్ ఆర్డర్ సమస్య తలెత్తకుండా జైపూర్ ఏసీపీ, కోటపల్లి సీఐ, ఎస్సై, చెన్నూరు సీఐ,ఎస్సై, పర్యవేక్షించారు. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.




## అడవుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి : డీఎఫ్‌వో బాలమణి

**కాగజ్‌నగర్, మే 18, ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ ఫారెస్ట్ డివిజన్ పరిధిలోని సిర్పూర్(టి) మండలం వేంపల్లి ఫారెస్ట్ బీట్‌లో సోమవారం మాక్ డ్రిల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఎఫ్‌వో బాలమణి హాజరై అటవీ అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అడవులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అడవుల్లో అనేక జీవరాసులు, పక్షులు జీవిస్తున్నాయని, వాటి పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. రైతులు అడవుల్లోకి వెళ్లే సమయంలో నిప్పురవ్వలు వేయరాదని సూచించారు. బీడీలు, సిగరెట్ ముక్కలు ఎండిన ఆకులపై పడితే అగ్నిప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. వేసవి కాలంలో చిన్న నిరక్ష్యం కూడా భారీ అగ్నిప్రమాదాలకు దారితీస్తుందని తెలిపారు. అడవుల్లో మంటలు చెలరేగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అటవీ ప్రాంతాల సమీపంలో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. మాక్ డ్రిల్ ద్వారా అగ్నిమాపక చర్యలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, వైద్య సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.



# ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం కృషి

### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**నస్పూర్, మే 18, ప్రభాతవార్త**

ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఐబి చౌరస్తా నుండి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా క్రీడాధికార సంస్థ మైదానం వరకు చేపట్టిన తెలంగాణ మారథాన్‌ఫిజికల్ లీటరసి కార్యక్రమంలో డిసిపి భాస్కర్, గుడిపేట 13వ పటాలము కమాండెంట్ వెంకటేశ్వర్లు, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి హనుమంత రెడ్డి, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, ఎ.సి.పి. ప్రకాష్, యువతీ యువకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మన దేశం యువ భారతదేశం అని, దేశంలో యువ జనాభా అధికంగా ఉందని తెలిపారు. రాష్ట్ర, దేశ అభివృద్ధిలో యువత అత్యంత కీలకమని, దేశ అభివృద్ధి కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనాలని తెలిపారు. ఆరోగ్యం, క్రమశిక్షణ కలిగి ఉండాలని, వ్యాయామం, యోగ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని తెలిపారు. మాదక ద్రవ్యాలు, మద్యం వల్ల కలిగే అనర్థాలను తెలుసుకొని యువత వాటికి దూరంగా ఉండాలని, మాదకద్రవ్య రహిత తెలంగాణగా సమిష్టిగా కృషి చేయాలని తెలిపారు. "నో టు డ్రగ్స్ ఎస్ టు ఎక్సర్సైజ్" నినాదం దిశగా ప్రతి ఒక్కరు ఆరోగ్యం వైపు అడుగులు వేయాలని, ప్రతి ఒక్కరికి ఆరోగ్యం ఆవశ్యకతపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతిరోజు వ్యాయామం చేయడం ద్వారా శారీరక రుగ్మత, మానసిక ఆందోళనల నుంచి బయటపడవచ్చు అని, అనారోగ్యం దరిచేరకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, యువతి యువకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



## కొనుగోలు చేసి తరలించిన ధాన్యం సిఎంఆర్ ప్రక్రియ వెంటనే ప్రారంభించాలి

### - మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, మే 18, ప్రభాతవార్త**

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించడం జరుగుతుందని, ఈ క్రమంలో రైస్ మిల్లర్లు ధాన్యం సి.ఎం.ఆర్. ప్రక్రియ వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్‌లతో కలిసి రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులు, రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం మద్దతు ధర చెల్లించి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని, అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం తడవకుండా గోదాములు, రైస్ మిల్లులకు కేటాయించిన ప్రకారం తరలించడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో గత ఖరీఫ్ లక్ష్యాలు పూర్తి చేసిన రైస్ మిల్లర్లు ఈసారి కేటాయించిన ధాన్యం లక్ష్యాల సాధన ప్రారంభించాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నుండి లారీల ద్వారా తరలించిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు త్వరగా దిగుమతి చేసుకోవాలని, రోజుకు 10 నుండి 15 లారీలు దిగుమతి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందు కొరకు అవసరమైన హమాలీల సంఖ్య పెంపొందించుకోవాలని, ధాన్యం దిగుమతిలో ఆలస్యం లేకుండా పరవేక్షించాలని తెలిపారు. రవాణా శాఖ ఆధ్వర్యంలో ధాన్యం తరలింపుకు అవసరమైన లారీలను సమకూర్చడం జరుగుతుందని, రైస్ మిల్లుల యజమానులు తమకు కేటాయించిన లక్ష్యాలను నిర్దేశిత సమయంలోగా పూర్తి చేసే విధంగా అధికారుల సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి ఎస్‌బిఐ బ్యాంకు ముందు అక్రమ వంతెన తొలగించాలి

### - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కు వినతి

**బెల్లంపల్లి, మే 18, ప్రభాతవార్త**



బెల్లంపల్లి మెయిన్ రోడ్డులో ఎస్బీఐ బ్యాంకు సమీపంలోని నాలాపై అక్రమంగా నిర్మించిన వంతెనను తక్షణమే తొలగించాలని ఎంసీపీఐయూ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కు ప్రజావాణి కార్యక్రమంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ రెండు నెలల క్రితమే ఈ వంతెన అక్రమంగా నిర్మిస్తున్నారని బెల్లంపల్లి తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా అక్రమ నిర్మాణం పూర్తవుతున్నా కూడా చూసి చూడనట్లు వ్యవహరించడం బాధాకరమని అన్నారు. చిన్న వ్యాపారులు రోడ్డుపై బండి పెట్టుకొని జీవనం సాగించేందుకు ప్రయత్నిస్తే వారిని కఠినంగా అడ్డుకుంటున్న అధికారులు, పెద్ద కమర్షియల్ కాంప్లెక్స్ కోసం నిర్మించిన భారీ వంతెన పై మాత్రం చర్యలు తీసుకోకపోవడం అన్యాయమని విమర్శించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, నాలాపై నిర్మించిన ఈ అక్రమ వంతెనను వెంటనే తొలగించి ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని కోరారు. అక్రమ నిర్మాణాలపై ఎంసీపీఐయూ పార్టీ ఎప్పటికప్పుడు పోరాటం కొనసాగిస్తుందని హెచ్చరించారు.

## కబ్జాదారుల నుంచి ఊర చెరువును కాపాడండి

### - పూడిక తీసి పునరుద్ధరించాలంటూ తహసిల్దార్‌కు వినతి

**జన్నారం, మే 18, ప్రభాతవార్త**




జన్నారం మండలం పొనకల్ గ్రామ శివారులోని సర్వే నెంబర్ 374లో గల ఊర చెరువును ఆక్రమణల నుంచి కాపాడి, పూడిక తీసి పునరుద్ధరించాలని గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ బక్కయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ చెరువులో వేసవికాలంలో నీరు లేక మూగ జీవాలు నీటి కోసం అలమటిస్తున్నాయని, పూడిక తీయడం వల్ల చుట్టుపక్కల బావుల్లో సైతం నీరు ఇంకి నీటి సమస్య తీరుతుందంటూ వినతి పత్రంలో పేర్కొన్నారు. వర్షాకాలంలో చెరువులో నీరు నిలువలేక రోడ్లపైకి వస్తుండడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. స్థానికులు, దళారులు చెరువు కట్టను కొనుగోలు చేసి సైతం ఆక్రమించారని, చెరువు స్థలంలో అక్రమంగా ఇందిరమ్మ ఇళ్లు, ఇతర నిర్మాణాలు చేపట్టారని వారు ఆరోపించారు. గతంలో వృద్ధులకు కేటాయించిన భూమిని కూడా దళారులు అమ్ముకున్నారని, చెరువు స్థలంలో చెట్లు నాటి ఆక్రమించుకున్నారని వినతిలో పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, ప్రభుత్వ చెరువును ఆక్రమించి వేసుకున్న షెడ్డులను తొలగించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని చెరువును స్వాధీనం చేసుకోవాలని వారు కోరారు.

# దేశవ్యాప్తంగా కెమిస్ట్ల సమ్మెకు టిఎంఎస్ఆర్‌యు మద్దతు

## - ప్రజల ఆరోగ్యం, చిన్న వ్యాపారాల రక్షణే లక్ష్యం



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి, మే 18, ప్రభాతవార్త**

దేశవ్యాప్తంగా మే 20న నిర్వహించనున్న కెమిస్ట్లు అండ్ డ్రగ్గిస్ట్లు సమ్మెకు తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (టిఎంఎస్ ఆర్ యు) పూర్తి మద్దతు ప్రకటించింది. ఈ సమ్మెను ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్లు అండ్ డ్రగ్గిస్ట్లు (ఏఐఓసిడి), తెలంగాణ కెమిస్ట్లు అండ్ డ్రగ్గిస్ట్లు అసోసియేషన్ పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ పోరాటం న్యాయసమ్మతమని పేర్కొంది. ఈ సందర్భంగా యూనియన్ మండల శాఖ కార్యదర్శి వి. సంతోష్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఔషధ రంగంలో జరుగుతున్న అనేక అన్యాయాలపై ప్రభుత్వ దృష్టిని సారించేందుకు ఈ సమ్మె ఎంతో అవసరమని తెలిపారు. ముఖ్యంగా ఇటీవల వేగంగా పెరుగుతున్న ఆన్‌లైన్ ఔషధ విక్రయాలు (ఈఫార్మసీస్) నియంత్రణ లేకుండా కొనసాగడం వల్ల ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్ సలహా లేకుండా మందులను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయడం వల్ల తప్పు మందులు వినియోగించే ప్రమాదం పెరుగుతుందని, దీని వల్ల అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాగే ఈ విధానం సంప్రదాయ మెడికల్ షాపులపై తీవ్ర ప్రభావం చూపుతుందని, చిన్న వ్యాపారులు ఆర్థికంగా దెబ్బతింటున్నారని తెలిపారు. ఇక కొన్ని ఔషధ కంపెనీలు సరఫరా విధానాన్ని మార్చి, మెడికల్ షాపులను పక్కన పెట్టి నేరుగా వినియోగదారులకు మందులు విక్రయించడం వల్ల రిటైల్ వ్యాపార వ్యవస్థ దెబ్బతింటోందని అన్నారు. ఈ మార్పుల ప్రభావంతో వేలాది మంది సేల్స్ ప్రమోటర్లు, మెడికల్ రిప్రజెంటేటివ్స్ ఉద్యోగ భద్రత కోల్పోతున్నారని ఆయన పేర్కొన్నారు. మరోవైపు ఔషధ ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సాధారణ ప్రజలకు మందులు భారంగా మారుతున్నాయని, మార్కెట్ ఆధారిత ధరల విధానం (కాస్ట్‌బేస్డ్ ప్రైసింగ్) వల్ల ప్రజలపై అదనపు భారం పడుతోందని విమర్శించారు. అందుకే ప్రభుత్వం ఔషధ ధరలపై నియంత్రణ తీసుకురావాలని, పారదర్శక విధానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నియంత్రణ లేని ఈఫార్మసీ వ్యవస్థ, అక్రమ లాభాల ఆశతో పనిచేస్తున్న కొన్ని సంస్థలు ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయని ఆరోపించారు. అందువల్ల ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఔషధ రంగాన్ని క్రమబద్ధీకరించాలని ఆయన కోరారు. మొత్తానికి ప్రజల ఆరోగ్యం, చిన్న వ్యాపారుల రక్షణ, ఉద్యోగ భద్రత, మరియు సరైన ఔషధ సరఫరా వ్యవస్థ కోసం చేపడుతున్న ఈ సమ్మెకు టిఎంఎస్ ఆర్ యు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ, ప్రతి ఒక్కరూ ఈ సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చింది అని ఓ ప్రకటనలో తెలియజేశారు.



చేపల చెరువును పరిశీలిస్తున్న ఎంపీడీవో లక్ష్మీకాంత్

## చేపల చెరువును పరిశీలించిన ఎంపీడీవో లక్ష్మీకాంత్

**సారంగాపూర్, మే 18, ప్రభాతవార్త:**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎంపీడీవో లక్ష్మీకాంత్ సోమవారం స్వర్ణ గ్రామంలోని స్వర్ణ ప్రాజెక్టు పరిసర ప్రదేశాలలో గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా తవ్వించిన చేపల చెరువును పరిశీలించారు. అక్కడ చేపల చెరువుకు సంబంధించిన నీటి సౌకర్యం, షేడ్ నిర్మాణం, నెట్ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీటి ద్వారా మంచి పౌష్టికాహారం లభిస్తుందని, గ్రామ ఆదాయం పెరుగుతుందని తెలిపారు. ఉపాధి కూలీలతో నేరుగా మాట్లాడి తగిన సౌకర్యాలు కల్పిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సహజసిద్ధమైన నీటిని ఉపయోగించుకొని రసాయనాలు లేకుండా పండ్ల మొక్కలు, పూల తోటలను పెంచుకుంటే మరో రకంగా గ్రామానికి ఆదాయం లభిస్తుందని చెప్పారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈసీ సాగర్, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయితీ కార్యదర్శి ప్రేమలత పాల్గొన్నారు.




మారథాన్ పరుగును ప్రారంభిస్తున్న ఎంపీడీవో లక్ష్మీకాంత్, ఎంఈఓ మహేందర్, సర్పంచ్ కోనేరు భూమన్న.

## ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణలో భాగంగా మారథాన్

**సారంగాపూర్, మే 18, ప్రభాతవార్త:**

మండల కేంద్రంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం ఫిట్ అండ్ యాక్టివ్ తెలంగాణ మారథాన్ పరుగులో ఎంపీడీవో లక్ష్మీకాంత్, ఎంఈఓ మహేందర్, సర్పంచ్ కోనేరు భూమన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మనిషి జీవనశైలి రోజురోజుకు మారుతోందని, తీసుకునే ఆహారం, చేసే శ్రమ సరైన విధానంలో ఉంటే వ్యక్తి మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండి అన్ని రంగాలలో ముందంజలో ఉంటాడని చెప్పారు. సమాజంలో యువత దురలవాట్లకు దూరంగా ఉంటే అన్ని రంగాలలో రాణిస్తారని, ప్రస్తుత కాలంలో చిన్న వయసులోనే వివిధ రకాల రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ప్రతి వ్యక్తి ఉదయాన్నే నడక, వ్యాయామం చేయడం ద్వారా శరీరం ఆరోగ్యంగా ఉంటుందని, ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం తెలంగాణలో ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కృష్ణారెడ్డి, గ్రామ యువత పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలపై కార్యాలయంలో ఫిర్యాదు చేయాలి

**జైనూర్, మే 18, ప్రభాతవార్త**

జైనూర్ మండల పట్టణంలో గృహవినియోగం, దుకాణాలకు ఉపయోగించే కరెంట్ మీటర్లు కలిగిన వినియోగదారులకు విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో కీలక సూచనలు చేశారు. మీటర్లకు స్తంభం నుండి సరఫరా ఆగిపోయినట్లయితే వినియోగదారులు నేరుగా కార్యాలయానికి వచ్చి యూసఫ్ కాల్ రిజిస్టర్‌లో తమ సర్వీస్ నెంబర్, ఫోన్ నెంబరు నమోదు చేయాలని కోరారు. ఫిర్యాదు నమోదు చేసిన తర్వాత సిబ్బంది ఒక నిర్ణీత సమయం కేటాయించి ఆ సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు. చాలా మంది వినియోగదారులు లోకల్ సిబ్బందికి వ్యక్తిగత ఫోన్లలో సమస్యలను చెబుతుండడం వల్ల అవి లైన్‌మెన్ దృష్టికి రావడం లేదని, దీనివల్ల సమస్యలు నిర్ణీత సమయంలో పరిష్కారం కావడం లేదని అధికారులు పేర్కొన్నారు.



చెక్కులను అందజేస్తున్న తహసిల్దార్ ప్రమోద్

## లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

**కౌటాల, మే 18, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం కల్యాణ లక్ష్మి పథకం కింద 13 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కల్యాణ లక్ష్మి పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కౌటాల ఉప సర్పంచ్ గోపాల్, లబ్ధిదారులలు పాల్గొన్నారు.

## పంటల ఉత్పాదకత పెంపుపై శాస్త్రవేత్తల సూచనలు

**కౌటాల, మే 18, ప్రభాతవార్త**

కౌటాల మండలంలోని గుడ్లబోరి గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ పెద్ది మంగ ఆధ్వర్యంలో రైతులకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం హైదరాబాద్, నుంచి శాస్త్రవేత్త డా. ఉపేంద్ర వ్యవసాయంలో అవలంబించాల్సిన కీలక అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియా వినియోగాన్ని తగ్గించడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించడంతో పాటు నేల సారవంతాన్ని పరిరక్షించవచ్చన్నారు. అవసరానికి మించిన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి ప్రకృతిని కాపాడాల్సింది రైతులే అని సూచించారు. పంట మార్పిడి విధానాన్ని అనుసరించడం ద్వారా సుస్థిర వ్యవసాయం సాధ్యమవుతుందని, రైతులు ఆదాయాన్ని పెంచుకునే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహిస్తూ మానవ ఆరోగ్యం, భూసారవంతం, పర్యావరణ పరిరక్షణకు రైతులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త డా. సుమిత్ర, మండల వ్యవసాయ అధికారి ప్రేమలత, వ్యవసాయ విస్తరణ అధికారి చౌదరి అంజన్న, ఉప సర్పంచ్ మధు, గ్రామ కార్యదర్శి భాస్కర్‌తో పాటు గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.



## కౌట్ల(బి)లో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం

**సారంగపూర్, మే 18, ప్రభాతవార్త:**



మండలంలోని కౌట్ల (బి) గ్రామంలో సోమవారం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని కౌట్ల పీఏసీఎస్ చైర్మన్ అయిర నారాయణ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ ఆది ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు తమ పంటను దళారులకు అమ్మి నష్టపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలనే సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ రకానికి క్వింటాలుకు రూ.2,389, సాధారణ (కామన్) రకానికి రూ.2,369 మద్దతు ధర నిర్ణయించిందని పేర్కొన్నారు. అలాగే తెలంగాణ ప్రభుత్వం సన్న రకం వరి పంటకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బల్గురి అజయ్, ఉపసర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, మ్యాక్స్ చైర్మన్ భూమారెడ్డి, డైరెక్టర్లు పోతరెడ్డి, భోజన్న, మ్యాక్స్ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



## దేగామ విద్యుత్ సబ్ స్టేషన్‌ను ముట్టడించిన టెంబి సర్పంచ్, గ్రామస్థులు

**బజార్‌హత్నూర్, మే 18, ప్రభాతవార్త:**

మండలంలోని దేగామ విద్యుత్ సబ్ స్టేషన్‌ను సోమవారం టెంబి గ్రామస్థులు, సర్పంచ్‌లు ముట్టడించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాంరెడ్డి మాట్లాడుతూ.. గత నెల రోజులుగా టెంబి, మంజరం తండా, ధర్మపురి, అనంతపూర్, చిన్నమీయా తండా గ్రామాలకు గంటల తరబడి విద్యుత్ నిలిపివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్రమైన ఉక్కపోత, దోమల బెడదతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, రాత్రిళ్లు నిద్రలేక అనారోగ్యం పాలవుతున్నారని వాపోయారు. విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడం వల్ల తాగునీటికి సైతం తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. విద్యుత్ శాఖ అధికారులు ఎలాంటి సమయపాలన పాటించకుండా పగలు, రాత్రి ఇష్టానుసారంగా సరఫరా నిలిపివేస్తున్నారని మండిపడ్డారు. గత రాత్రి 10 గంటలకు నిలిపివేసిన విద్యుత్తును ఉదయం నాలుగు గంటల వరకు కూడా పునరుద్ధరించలేదని పేర్కొన్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని, తీరా సబ్ స్టేషన్ ముట్టడిస్తే అక్కడ సిబ్బంది ఎవరూ అందుబాటులో లేరని తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు తమ తీరు మార్చుకోకుంటే ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గు ఉత్పత్తికి

# ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్ - శ్రీరాంపూర్ ఏరియాలో మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలు ప్రారంభం

- సంస్థ మనుగడే లక్ష్యంగా ఉద్యోగులకు దిశానిర్దేశం చేసిన జీఎం మునిగంటి శ్రీనివాస్

నస్పూర్, మే 18, ప్రభాతవార్త



రక్షణతో కూడిన నాణ్యమైన బొగ్గు ఉత్పత్తికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. నిర్దేశిత ఉత్పత్తి, ఉత్పాదకత సాధనే లక్ష్యంగా సింగరేణి యాజమాన్యం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలు సోమవారం శ్రీరాంపూర్ ఏరియాలో ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఆర్.కె 7 భూగర్భ గని, జీఎం కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులకు మునిగంటి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మార్కెట్ పోటీ తట్టుకుని సంస్థను లాభాల బాటలో నడపడానికి ఉద్యోగులు కార్యోన్ముఖులు కావాలని స్పష్టం చేశారు. కొత్త గనులు రాకపోవడం వల్ల ఉత్పత్తి ఖర్చు పెరుగుతోందని మునిగంటి శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. నాణ్యత లోపాల వల్ల సింగరేణి బొగ్గుకు డిమాండ్ తగ్గుతోందని వివరించారు. ఇప్పటికే టన్నుకు దాదాపు 700 రూపాయలు తగ్గించడం వల్ల ఏడాదికి 4 వేల కోట్ల రూపాయల నష్టం వాటిల్లుతోందని గణాంకాలతో సహా పేర్కొన్నారు. యంత్రాల వినియోగ సమయాన్ని పెంచుకుంటూ సంస్థ ఉనికిని కాపాడాలని కోరారు. ఉద్యోగుల ఉపాధి కేంద్రాలైన భూగర్భ గనుల జీవిత కాలాన్ని పెంచుకోవడం ఎంతో ముఖ్యమని గుర్తుచేశారు. జీఎం కార్యాలయంలోని సపోర్టింగ్ డిపార్ట్మెంట్లు ఎలాంటి తాత్సారం లేకుండా విధులు నిర్వహిస్తూ ఉత్పత్తి లక్ష్యాల సాధనకు దోహదపడాలని సూచించారు. ఎస్ఓటూ జీఎం కన్వీనర్గా రెండు బృందాలు ఏరియా పరిధిలోని అన్ని గనులు, విభాగాలలో ఈ సమావేశాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఆర్.కె 7 గనిలో మూడు షిఫ్టుల ఉద్యోగులకు టీం1 ప్రతినిధులు సంస్థ ఆర్థిక పరిస్థితులు, గని స్థితిగతులపై అవగాహన కల్పించారు. ఉత్పత్తి, ఉత్పాదకతపై డీజీఎం (ఐఈడీ) రాజన్న, ఆర్థిక వ్యవహారాలపై ఏజీఎం (ఫైనాన్స్) సుమలత, నాణ్యత ప్రాధాన్యతపై హనుమాన్ గౌడ్, రక్షణపై ఏఎస్ఓ విజయ్ కుమార్, సంక్షేమంపై డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్ లోటుపాట్లను వివరించారు. సంస్థ సవాళ్లపై కమిటీ కన్వీనర్ ఎస్ఓటూ జీఎం ఎన్. సత్యనారాయణ దిశానిర్దేశం చేశారు. సంస్థ మనుగడే లక్ష్యంగా విధులు నిర్వహించాలని గుర్తింపు సంఘం అసిస్టెంట్ బ్రాంచి సెక్రటరీ మోతుకూరి కొమురయ్య కోరారు.

జీఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో ఇంటర్నల్ ఆడిట్, డిస్పెన్సరీ సిబ్బందికి టీం2 ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. గనుల్లో ఉత్పత్తి సాధన దిశగా సపోర్టింగ్ డిపార్ట్మెంట్స్ ఎలాంటి జాప్యం లేకుండా పని చేయాలని అవగాహన కల్పించారు. ఈఈ (ఐఈడీ) సాయికిరణ్, ప్రాజెక్ట్ ఇంజనీర్ కృష్ణారావు, డిప్యూటీ ఫైనాన్స్ మేనేజర్ నరేష్, అడిషనల్ మేనేజర్ మహేష్, అడిషనల్ మేనేజర్ అమర్నాథ్, డీవై పీఎం రాజేష్ వాస్తవ పరిస్థితులను వివరించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని పిట్ సెక్రటరీ సందీప్ కోరారు. కాగా, మంగళవారం టీం1 ఆధ్వర్యంలో ఎస్ఆర్పీ 3 గనిలో, టీం2 ఆధ్వర్యంలో ఎస్ఆర్పీ 1 గనిలో మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలు జరగనున్నాయి.

## నేత్రదానంతో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపిన రాజ మొగిలి

బెల్లంపల్లి, మే 18, ప్రభాతవార్త



బెల్లంపల్లి పట్టణంలోని బాబు క్యాంప్ బస్తికి చెందిన మొగిలి పాన్ షాప్ నిర్వాహకులు జక్కోజు రాజ మొగిలి (63) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయన మరణం కుటుంబ సభ్యులకు తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ఈ దుఃఖ సమయంలో కూడా సమాజానికి సేవ చేయాలనే సంకల్పంతో కుటుంబ సభ్యులు ముందుకు వచ్చి నేత్రదానం చేయడం విశేషం. సోమవారం ఉదయం వాసన్ ఐ బ్యాంక్ సిబ్బంది చందు నేతృత్వంలో ఆయన కంటి కార్నియాలను సేకరించారు. ఈ నేత్రదానం ద్వారా ఇద్దరు దృష్టి కోల్పోయిన వారికి చూపు లభించే అవకాశం కలిగింది. ఈ సందర్భంగా జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ రాజ మొగిలి మృతి బాధాకరమని, అయితే ఇలాంటి సమయంలో కూడా కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం ఎంతో ప్రేరణాత్మకమని అన్నారు. భార్య రమాదేవి, కుమార్తెలు ప్రియాంక, ప్రవళిక, ప్రతిభ, సోదరుడు రవి నేత్రదానానికి ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. జనహిత సేవా సమితి ద్వారా ఇది 16వ నేత్రదానం కార్యక్రమంగా నిర్వహించబడినట్లు ఆయన వెల్లడించారు. నేత్రదానం ద్వారా మరణించిన వ్యక్తి కంటి కార్నియా పొరను 8 గంటలలోపు సేకరించి, ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించవచ్చని వివరించారు. అలాగే ప్రజలు అపోహలు వీడి నేత్ర, అవయవ, శరీర దానాలపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. బ్రెయిన్ డెడ్ పరిస్థితిలో అవయవ దానం ద్వారా పలువురి ప్రాణాలు కాపాడవచ్చని, శరీరదానం ద్వారా వైద్య విద్యకు ఉపయోగపడుతుందని చెప్పారు. నేత్రదానం అనంతరం వాసన్ ఐ బ్యాంక్ వారు కుటుంబ సభ్యులకు నేత్రదాన సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి ఉపాధ్యక్షులు కందుల రాజన్న, హనుమాండ్ల రమాదేవి, సభ్యులు జంబోజు చంద్రశేఖర్, పన్నాల సదానందం, భీమిని కనకయ్య తదితరులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి

- ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యకు న్యాయవాది మాదిరి రాకేష్ విజ్ఞప్తి

బెల్లంపల్లి, మే 18, ప్రభాతవార్త



తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యను సోమవారం హైదరాబాద్లోని వారి అధికారిక కార్యాలయంలో బెల్లంపల్లికి చెందిన న్యాయవాది మాదరి రాకేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి గౌరవం తెలిపారు. అనంతరం బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న పలు కీలక సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా పట్టణంలో మౌలిక సదుపాయాల కొరత, డ్రైనేజీ వ్యవస్థలో లోపాలు, రహదారుల దుస్థితి, తాగునీటి సమస్యలు, పారిశుధ్య లోపాలు వంటి అంశాలను వివరంగా తెలియజేశారు. అదేవిధంగా మున్సిపాలిటీలో చోటుచేసుకుంటున్న అవినీతి ఆరోపణలను కూడా ప్రస్తావిస్తూ, వాటిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బెల్లంపల్లి పట్టణం అభివృద్ధి దిశగా మరింత వేగంగా ముందుకు సాగాలంటే ప్రత్యేక నిధులు అత్యవసరమని మాదరి రాకేష్ వివరించారు. ఈ నేపథ్యంలో మున్సిపాలిటీకి ప్రత్యేక ఫండ్ కేటాయించాలని, పట్టణ అభివృద్ధికి అవసరమైన ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించిన వినతి పత్రాన్ని చైర్మన్కు సమర్పించారు. అలాగే బెల్లంపల్లి పట్టణం సామాజిక, ఆర్థిక పరంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వ స్థాయిలో ప్రత్యేక దృష్టి అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా పేద ప్రజలకు మౌలిక వసతులు అందించడంలో ప్రభుత్వం చురుకైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా చైర్మన్ సిరిసిల్ల రాజయ్య సమస్యలను శ్రద్ధగా విని, వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు మాదరి రాకేష్ తెలిపారు. బెల్లంపల్లి అభివృద్ధి కోసం తాను నిరంతరం ప్రయత్నాలు కొనసాగిస్తానని, ప్రజల సమస్యలను ఉన్నత స్థాయిలో ప్రస్తావిస్తూ పరిష్కారం దిశగా కృషి చేస్తానని రాకేష్ స్పష్టం చేశారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఆశా వర్కర్లు

## ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్కు ఆశావర్కర్ల వినతిపత్రం

భైంసా, మే 18, ప్రభాతవార్త:

భైంసా పట్టణంలోని ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ నివాసంలో ఆశా వర్కర్లు తమ న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన కోసం వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ ఆశా వర్కర్లు గ్రామీణ ఆరోగ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. వారికి వేతనాల పెంపుతో పాటు పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## భైంసా పట్టణ స్మశాన వాటిక దుస్థితిపై చర్యలు తీసుకోవాలి

- యువ నాయకుడు కాంబ్లే సాహెబ్రావు

భైంసా, మే 18, ప్రభాతవార్త:



భైంసా పట్టణంలోని స్మశాన వాటిక ప్రస్తుతం తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటోందని, అక్కడ కనీస వసతులు లేకపోవడం వల్ల ప్రజలు అంత్యక్రియలు నిర్వహించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని యువ నాయకుడు కాంబ్లే సాహెబ్రావు ఆవేదన వ్యక్తం చేశారు. స్మశాన వాటికకు వెళ్లే దారి సరిగ్గా లేకపోవడంతో పాటు తాగునీరు, నీడ, లైట్ల సౌకర్యం లేదని పేర్కొన్నారు. సరైన నిర్వహణ లోపంతో పిచ్చిమొక్కలు పెరిగిపోయి మైదానం అధ్వాన్నంగా మారిందని తెలిపారు. ఈ సమస్యలన్నింటినీ వివరిస్తూ తీసిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నట్లు చెప్పారు. స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి స్మశాన వాటికను తక్షణమే అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోవాలని, ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు.

## గన్ని బ్యాగులు, లారీల కొరత తీర్చాలని అదనపు కలెక్టర్కు వినతి

సారంగపూర్, మే 18, ప్రభాతవార్త:

మండలంలోని కంకేట, వైకుంఠాపూర్, తాండ్ర గ్రామాలకు చెందిన రైతులు పార్టీలకు అతీతంగా ఏకమై మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల్లో ఎదురవుతున్న సమస్యలపై అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్కు వినతిపత్రం అందజేశారు. కొనుగోలు కేంద్రాల్లో గన్ని బ్యాగుల కొరత తీవ్రంగా ఉందని, దీనివల్ల రైతులు రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తోందని వివరించారు. అలాగే కొనుగోలు చేసిన మొక్కజొన్నను మిల్లులకు తరలించడానికి లారీల కొరత కూడా వేధిస్తోందని పేర్కొన్నారు. మరో వారం, పది రోజుల్లో వర్షాలు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న మొక్కజొన్న, వరి పంటలు తడిసిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. దీనిపై అదనపు కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ, గన్ని బ్యాగులు, లారీల కొరతను త్వరలోనే తీర్చి కొనుగోళ్ల వేగవంతం చేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మూడు గ్రామాల రైతులు, నాయకులు పాల్గొన్నారు.





రైతులతో మాట్లాడుతున్న అధికారులు

## వడ్ల అన్లోడ్‌లో జాప్యం...
# గోదాం వద్ద రైతులు నిరసన

**వేమనపల్లి, మే 18, ప్రభాతవార్త**

వేమనపల్లి వడ్ల గోదాం వద్ద రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. తమ ప్రాంతానికి చెందిన వడ్లను గోదాంలో అన్‌లోడ్ చేయకుండా చెన్నూరు నుంచి వచ్చిన వడ్ల అన్లోడింగ్‌ను రైతులు అడ్డుకున్నారు. తమ ప్రాంతం వడ్లను అన్లోడింగ్ చేయకుండా ఆలస్యం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చిన బస్తాలను ముట్టకుండా నిరసన తెలిపారు. సమాచారం తెలుసుకున్న తహసీల్దార్ సాయి కృష్ణ ఘటన స్థలానికి చేరుకొని అధికారులకు సమాచారం అందించారు. అనంతరం సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడంతో అన్లోడ్ ప్రక్రియ ప్రారంభమైంది. మా ప్రాంతానికి చెందిన వడ్లను అన్‌లోడ్ చేయించేలా చర్యలు తీసుకోవాలని రైతులు తహసీల్దార్‌కి విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యలను విన్న తహసీల్దార్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నీల్వాయి ఎస్సై జగదీశ్వర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి వీరన్న, ఆర్ఐ ఖాలీక్, వ్యవసాయ అధికారులు రైతులు, పాల్గొన్నారు.



గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ హరిత

## యూత్ అండ్ స్పోర్ట్స్ థీమ్ గోడ ప్రతుల ఆవిష్కరణ

**ఆసిఫాబాద్, మే 18, ప్రభాతవార్త :**

ఈ నెల 18 నుంచి 23 వరకు నిర్వహించే యూత్ అండ్ స్పోర్ట్స్ థీమ్ గోడ ప్రతుల ఆవిష్కరణ జిల్లా కలెక్టర్ హరిత చేతుల మీదుగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో బాగంగా సోమవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్లో  ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు క్రీడలపై ఆసక్తి, నాయకత్వ లక్షణాల పెంపు, సామాజిక బాధ్యత, ఉద్యోగ అవకాశాల కల్పన కోసం జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో యూత్ అండ్ స్పోర్ట్స్ థీమ్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందన్నారు. మండల, జిల్లా స్థాయిలో నిర్వహించే ఆరు రోజుల ప్రణాళికలో యువత, ఎన్.జి.ఓ., యూత్ కబ్ల్, యవజన సంఘాలు, క్రీడా సంఘాలు, క్రీడా అభిమానులు, క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ప్లానింగ్ అధికారి,  జిల్లా యువజన క్రీడల అధికారి అశ్వక్ అహ్మద్ తో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ప్రజావాణి సమస్యల పరిష్కారంపై
# అధికారులు సమన్వయంతో కృషి చేయాలి

**- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**నస్పూర్, మే 18, ప్రభాతవార్త**

ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు పి. చంద్రయ్య, వి. రాములులతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల పట్టణం జాఫర్ నగర్ ప్రాంతానికి చెందిన పర్వీన్ సుల్తానా, ఫర్జానా నిరుపేద అయిన తమకు రెండు పడక గదుల ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ వేరువేరుగా అర్జీలు సమర్పించారు. మంచిర్యాల పట్టణానికి చెందిన కమ్మరి రాజేశ్వరి నిరుపేద అయిన తనకు ఒంటరి మహిళ పింఛన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణం ఎన్‌టిఆర్ నగర్ కు చెందిన ముజ్జిగ స్వప్న కూలి పని చేసుకుంటూ జీవిస్తున్న నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం చాకేపల్లి గ్రామస్తులు తమ గ్రామంలో ఎస్ సి నేతకాని గూడెంలో మంజూరు అయిన బోర్ వెల్ ఏర్పాటు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జన్నారం మండలం వినాయక నగర్ కాలనీవాసులు తమ కాలనీలో ఇండ్ల మధ్యలో నిర్వహిస్తున్న బీడీ ఫ్యాక్టరీని తొలగించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దండేపల్లి మండలం మాకులపేట గ్రామానికి చెందిన ముత్తినేని రాజమణి తన పొలంలో సాగు చసిన మొక్కజొన్న పంట చేతికి వచ్చే సమయంలో అడవి పందులు పూర్తిగా నాశనం చేశాయని, నష్టపరిహారం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 64 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

మండల ప్రత్యేక అధికారులుగా నియమించబడిన జిల్లా అధికారులు తమ మండలాల పరిధిలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతుల వద్ద నుండి కొనుగోలు చేసిన వరి ధాన్యాన్ని కేటాయించిన ప్రకారంగా రైస్ మిల్లులు, గోదాములకు తరలించాలని, దిగుమతి, హమాలీల సంఖ్య పెంపుదల అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

అనంతరం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 18వ తేదీ నుండి 23వ తేదీ వరకు పర్యాటక రంగం ఆధ్వర్యంలో నిర్వహించవలసిన కార్యక్రమాల సంబంధిత కరపత్రాలు, గిరిజనుల సంక్షేమం కోసం దేశవ్యాప్తంగా చేపట్టిన జన జాతీయ గరిమ ఉత్సవ్ 2026 సంబంధిత గోడ ప్రతులను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. యువ టూరిజం క్లబ్, అవగాహన కార్యక్రమాలు, హెరిటేజ్ వాక్, స్థానిక ఇన్ఫ్లుయెన్సర్/యూట్యూబర్స్‌తో సమావేశం, స్వచ్ఛత, టూరిజం బ్రాండ్ విడుదల, పారిశుధ్యం వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ధర్తీ ఆబా జన జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్‌లో భాగంగా గిరిజన గ్రామాలలో రహదారులు, త్రాగునీరు, ఆరోగ్యం, విద్యుత్, ఇండ్ల నిర్మాణం వంటి కనీస సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి జామా మసీదు సదర్‌గా ఎండి ఖలీల్ ఎన్నిక

**బెల్లంపల్లి, మే 18, ప్రభాతవార్త**



బెల్లంపల్లి పట్టణంలోని జామా మసీదు సదర్‌గా భారీ మెజార్టీతో ఎన్నికైన ఎండి ఖలీల్‌ను పట్టణ మైనార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు ఖలీల్‌కు శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ జామా మసీదు అభివృద్ధి మరియు సామాజిక సేవా కార్యక్రమాల్లో ఖలీల్ కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ముస్లిం సమాజ ఐక్యతకు ఆయన నాయకత్వం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎండి ఖలీల్ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ మసీదు అభివృద్ధికి, సమాజ సేవకు కృషి చేస్తానని తెలిపారు. అందరి సహకారంతో ముందుకు సాగుతానని అన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో మైనార్టీ నాయకులు, మసీదు కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రజావాణిలో కలెక్టర్‌కు 3వ వార్డు అర్హుల జాబితా అందజేత

**- డబుల్ బెడ్ రూమ్‌లో మాకు జీరో**
**- రెండవ విడతలో ప్రత్యేక చొరవ తీసుకుని ఇళ్లు మంజూరు చేయండి**
**- 3వ వార్డు కౌన్సిలర్ బిడ్డల సౌజన్య విజయ్ కుమార్**

**బెల్లంపల్లి, మే 18, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం రోజున నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపాలిటీ 3వ వార్డు కౌన్సిలర్ బెడ్డల సౌజన్య - విజయ్ కుమార్ పాల్గొని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 3వ వార్డు పరిధిలోని అంబేద్కర్ నగర్, రవీంద్రనగర్ ప్రాంతాలకు చెందిన నిజమైన అర్హుల జాబితాను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. వార్డు పరిధిలో అనేక నిరుపేద కుటుంబాలు ఇప్పటికీ రేకుల షెడ్లు, గుడిసెల్లో నివసిస్తున్నాయని తెలిపారు. మా వార్డులోని ప్రజలు గత 30 ఏళ్లుగా నివాస సమస్యతో బాధపడుతున్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపులో 3వ వార్డుకు ఒక్క ఇల్లు కూడా రాలేదు. అనేక సార్లు సర్వేలు నిర్వహించి, గ్రామసభల్లో పేర్లు చదివినా ఇప్పటి వరకు ఒక్క ఇందిరమ్మ ఇల్లు కూడా మంజూరు కాలేదు. వీరంతా నిజమైన అర్హులు. కనుక రెండవ విడతలో ప్రత్యేక చొరవ తీసుకుని ఇళ్లు మంజూరు చేయాలని కౌన్సిలర్ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ను కోరారు. అర్హులైన కుటుంబాల పేర్లు, అప్లికేషన్ నంబర్లు, ఫోన్ నంబర్లతో కూడిన పూర్తి జాబితాను కలెక్టర్‌కు అందజేశారు. వినతి పత్రాన్ని స్వీకరించిన జిల్లా కలెక్టర్, అంబేద్కర్ నగర్, రవీంద్రనగర్ ప్రాంతాల అర్హుల జాబితాను స్వయంగా పరిశీలించి, ఆర్‌డీవో, మున్సిపల్ కమిషనర్‌తో సమీక్ష సమావేశం నిర్వహించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటాను అని హామీ ఇచ్చారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

**ఆసిఫాబాద్, మే 18, ప్రభాతవార్త :**



ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవెన్యు ఎం డెవిడ్ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి  రెవెన్యూ అధికారి దాసరి వేణుతో కలిసి అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమములో వచ్చే  ప్రతి దరఖాస్తును సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.  గత ప్రజావాణిలో అందిన దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం దరఖాస్తు దారుల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ళు, పింఛన్లు, బోర్లు మంజూరు చేయాలని, భూ సమస్యలు పరిష్కరించాలని పలువురు దరఖాస్తులు పెట్టుకున్నారు.

# విద్యుత్ అధికారుల తీరుపై ఆగ్రహం

**తాండూర్, మే 18, ప్రభాతవార్త :**


విద్యుత్ శాఖ అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

మండలంలోని అచ్చలాపూర్ లో సోమవారం విద్యుత్ శాఖ అధికారులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అచ్చలాపూర్ గ్రామంలో ఆదివారం కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి ట్రాక్టర్ దగ్ధం సంఘటనలో విద్యుత్ అధికారుల తీరుపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేసి ఆందోళనకు దిగారు. వేలాడే కరెంట్ తీగలు, వంగిన స్తంభాల కారణంగానే ప్రమాదం సంభవించిందన్నారు. పేద రైతు ట్రాక్టర్ దగ్ధమైందని గ్రామస్థులు, రైతులు అధికారులపై మండిపడ్డారు. ప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలించి కారణాలు తెలుసుకోవడానికి సోమవారం గ్రామానికి వచ్చిన శాఖ ఏఈ జాన్ , లైన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, జూనియర్ లైన్మెన్ మహదేవ్ ను నిరదీశారు. గ్రామంలోనీ పలుచోట్ల రోడ్లపై విద్యుత్ తీగలు వేలాడుతూ వాహనాలకు, ఎడ్లబండ్లకు కూడా తాకే విధంగా ఉన్నాయని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని కొన్ని నెలలుగా చెబుతున్నప్పటికీ పట్టించుకోలేదని ఆగ్రహించారు. ట్రాక్టర్ దగ్ధమైనది ఘటనలో డ్రైవర్, మరో యువ రైతు త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయట పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాక్టర్ యజమానికి నష్ట పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో వేలాడే తీగల మరమ్మతులను వెంటనే ప్రారంభించి ప్రమాదాలు జరగకుండా తగ్గిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనికి ఏఈ మాట్లాడుతూ పై అధికారులకు విషయం తెలియజేస్తానని చెప్పగా అందుకు స్థానికులు అభ్యంతరం తెలిపి ఇప్పటికిప్పుడే పరిహారం విషయం తేల్చాలంటూ అధికారులను కదలనీయకుండా ఘెరావ్ చేశారు. దీంతో తాండూర్ ఎస్సై ప్రసాద్ అక్కడకు చేరుకుని గ్రామస్తులతో, విద్యుత్ శాఖ ఏఈతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండు, మూడు నెలల్లో ట్రాక్టర్ యజమానికి పరిహారం ఇప్పించడానికి ప్రతిపాదనలు పంపిస్తామని డిఈఈ ఫోన్లో చెప్పడంతో స్థానికులు శాంతించారు. ఈ వర్షాకాలం ప్రారంభానికి ముందే గ్రామంలో విద్యుత్ లైన్ల పూర్తి స్థాయి మరమత్తులు పూర్తి చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని స్థానిక నాయకులు, రైతులు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గట్టు సంతోష్, కాంగ్రెస్ నాయకులు మారిశెట్టి శ్రీనివాస్, కొండ సాయి, మాజీ ఉప సర్పంచ్ సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 20న మెడికల్ షాపులు బంద్

**తాండూర్, మే 18, ప్రభాతవార్త :**




ఈ నెల 20న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త మెడికల్ షాపుల బంద్ పిలుపులో భాగంగా మెడికల్ షాపులు బంద్ నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మెడికల్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ ఆసోసియేషన్ తాండూర్ మండల అధ్యక్షుడు జగన్మోహన్ చారి తెలిపారు. తాండూర్ ప్రెస్ క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జారీచేసిన ఆన్ లైన్ మెడిసిన్ విక్రయాల నోటిఫికేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2018 నుంచి ఇప్పటి వరకు అనేకసార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విన్నవించినా ఆన్ లైన్ మెడిసిన్ విక్రయాలు నిలిపివేయడంలేదన్నారు. కెమిస్ట్, డ్రగ్గిస్ట్ నిబంధనలకు వ్యతిరేఖంగా కొనసాగుతున్న విక్రయాలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీబయోటిక్ మందుల విక్రయాలు ప్రజలకు ప్రమాద కరమని పేర్కొన్నారు. దేశ వాప్తంగా 40 లక్షలు, రాష్ట్రంలో 14 లక్షల హోల్సేల్, రిటైల్ షాపులున్నాయని, వీటిపై ఆధారపడి కోట్లాది మంది నిరుద్యోగ యువత జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. దేశ వ్యాప్త మెడికల్ షాపుల బంద్ లో హోల్సేల్, రిటైల్ షాపుల యాజమాన్యాలు పాల్గొంటాయన్నారు. బంద్ సందర్భంగా ప్రజలకు ఇబ్బంది కలుగకుండా అత్యవసర వైద్య సేవల మందులు అందుబాటులో ఉంటాయన్నారు. అత్యవసర మందుల కోసం 9347551355, 9866004480 నంబర్లను సంప్రదించాలని కోరారు. అనంతరం కరపత్రాలు విడుదల చేశారు. ఈ సమావేశంలో తాండూర్ మండల ప్రధాన కార్యదర్శి తాటిపాముల రాంప్రసాద్, ఉపాధ్యక్షుడు భోగె శ్రీకాంత్, కార్యవర్గ సభ్యులు మామిడాల రాజేశం, బొంతల తిరుపతి, నేరెళ్ల కుమార్, గందే వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

## 19న జిల్లాకు రాష్ట్ర ఎస్సి, ఎస్టి కమిషన్ సభ్యులు రాక

**ఆసిఫాబాద్, మే 18, ప్రభాతవార్త :**

తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యులు ఈ నెల 19న జిల్లాకు రానున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సిర్పూర్ నియోజకవర్గ పరిధిలోని చింతలమానపల్లి మండలం కర్జవెల్లి గ్రామపంచాయతీ పరిధిలో తమ కుటుంబాలను పోషించుకునేందుకు గత కొన్ని సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్న పోడు భూములలో సాగు అవుతున్న పంటలను అటవీశాఖ అధికారులు ధ్వంసం చేసి భూముల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారని, పోడు రైతులు చేసిన ఫిర్యాదు మేరకు రాష్ట్ర కమిషన్ సభ్యులతో కలిసి విచారణ చేయడం జరుగుతుందని తెలిపారు. దాదాపు 50 షెడ్యూల్ కులాలకు చెందిన కుటుంబాలు కుటుంబానికి 2/3 ఎకరాల చొప్పున పంట సాగుపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారని, అటవీ శాఖ అధికారులు తమ పంటను ధ్వంసం చేయడమే కాకుండా కేసులు నమోదు చేస్తామని భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు బాధితులు దరఖాస్తులో పేర్కొన్నారన్నారు. ఈ విషయమై క్షేత్రస్థాయిలో సందర్శించి విచారించడం జరుగుతుందని తెలిపారు.



## సింగరేణి స్థితి గతులపై అవగాహన

**తాండూర్, మే 18, ప్రభాతవార్త :**

గోలేటి జనరల్ మేనేజర్ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్ లో సోమవారం మల్టీ డిపార్ట్మెంట్ కమిటీ అధికారు ల సమావేశం నిర్వహించారు. అన్ని విభాగాల అధిపతులకు సింగరేణి సంస్థ గతంలో సాధించిన ప్రగతి, భవిష్యత్ కార్యాచరణ, ఉద్యోగులు, మహిళ ఉద్యోగులు, యంత్రాల వినియోగం పై పవర్ పాయింట్ ప్రసెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయభాస్కర రెడ్డి మాట్లాడుతూ..సంస్థ గతంలో సాధించిన లక్ష్యాలు, భవిష్యత్ లో లక్ష్యాల సాధనకు ఉద్యోగుల పనితీరు ఎలా ఉండాలో వివరించారు. సంస్థ మనది అనుకోని పనిచేస్తే భావితరాలకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. సంస్థ అభివృద్ధికి కోసం చేపట్టాల్సిన కార్యాచరణ పై అధికారుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కిరణ్ , శేష శయన రావు, ఏరియా సీఎంఓఏఐఅధ్యక్షులు మరియు ప్రాజెక్ట్ అధికారి మచ్చగిరి నరేందర్, ఏరియా ఇంజినీర్ కృష్ణ మూర్తి, ఇంచార్జి ఎస్ ఓటు జిఎం ఉమాకాంత్, డీజీఎం ఉజ్వల్ కుమార్ బెహార అన్ని విభాగాల హెచ్ ఓ డి లు పాల్గొన్నారు.



ఎఫ్డీఓను సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

## యాదవ సంఘం ఆధ్వర్యంలో ఎఫ్డీఓకు సన్మానం

**కాగజ్నగర్ రూరల్,మే 18, ప్రభాతవార్త :**

యాదవ సంఘం ఆధ్వర్యంలో అటవీ శాఖలో సేవలందిస్తున్న ఎఫ్డీఓను సోమవారం ఆయన కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు పాల్గొని శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ శ్రీకాంత్, మహేష్, శ్రీశైలం, లక్ష్మయ్య, శ్రీశైలం తదితర నాయకులు పాల్గొన్నారు.

## పోడు భూములపై కమిషన్ దర్యాప్తు నేడు

### - బాధితుల ఫిర్యాదుతో క్షేత్రస్థాయికి కమిషన్ సభ్యులు.

### - మండలంలో పోడు భూముల వివాదంపై విచారణ

**చింతలమానేపల్లి, మే 18, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యులు జిల్లా శంకర్ మంగళవారం జిల్లాకు రానున్నారు. సిర్పూర్ నియోజకవర్గ పరిధిలోని చింతలమానేపల్లి మండలం కర్జవెల్లి గ్రామపంచాయతీ పరిధిలో అటవీశాఖ అధికారులు పోడు భూములను ధ్వంసం చేశారనే వ్యవహారంపై ఆయన క్షేత్రస్థాయిలో విచారణ జరపనున్నారు. కర్జవెల్లి జీపీ పరిధిలో గత కొన్ని సంవత్సరాలుగా దాదాపు 50 ఎస్సీ కుటుంబాలు తలా రెండు, మూడు ఎకరాల చొప్పున పోడు భూములను సాగు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. అయితే, తమ పొలాల్లో ఎదుగుతున్న పంటలను అటవీశాఖ అధికారులు అన్యాయంగా ధ్వంసం చేసి, భూముల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారని బాధిత రైతులు రాష్ట్ర కమిషన్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తమ జీవనోపాధిని దెబ్బతీయడమే కాకుండా, భూముల్లోకి వస్తే కేసులు నమోదు చేస్తామని అధికారులు తమను తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తున్నారని బాధితులు దరఖాస్తులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన రాష్ట్ర కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, అధికారులతో కలిసి మంగళవారం వివాదాస్పద ప్రాంతంలో పర్యటించి వాస్తవాలను పరిశీలించనున్నారు. బాధితులతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది.

## రామకృష్ణాపూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గం ఎన్నిక

**క్యాతన్‌పల్లి, మే 18, ప్రభాతవార్త**

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఒడ్నాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో రామకృష్ణపూర్ పట్టణ కమిటీని ఏక గ్రీవంగా ఎన్నుకున్నట్లు సోమవారం పార్టీ కార్యలయంలో అధికారికంగా ప్రకటించారు. జిల్లా అధికార ప్రతినిధి అబ్దుల్ అజీజ్, సీనియర్ నాయకులు నీలం శ్రీనివాస్ గౌడ్, గాండ్ల సమ్మయ్య, మహిళా నాయకులు కొండవేణ పుష్ప, కొలిపాక దీపలు కమిటీ ప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ దేశ స్వాతంత్ర్య పోరాటం నుండి సామాన్య ప్రజల హక్కుల పరిరక్షణ వరకు నిరంతరం ప్రజల పక్షాన నిలిచిన గొప్ప చరిత్ర కలిగిన పార్టీ అని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ వంటి మహానేతల ఆశయాలతో ముందుకు సాగుతున్న కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ సామాజిక న్యాయం, లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కృషి చేస్తోందన్నారు. ఈ నూతన కార్యవర్గంలో బీసీ, ఎస్సీ, కార్మిక, యువజన వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వడం కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయానికి కట్టుబాటుకు నిదర్శనమన్నారు.కాంగ్రెస్ పార్టీకి అసలైన బలం కార్యకర్తలేనని, కష్టకాలంలో కూడా పార్టీ జెండాను మోసిన కార్యకర్తల త్యాగాలు ఎన్నటికీ మరువలేమన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ, ప్రజలకు అండగా నిలుస్తూ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి తీసుకెళ్లే బాధ్యతను ప్రతి నాయకుడు, కార్యకర్త సమర్థవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యక్షులుగా ఆకుల రాజయ్య, పనస రాజయ్య, కాసర్ల ప్రకాష్, కట్కూరి శ్రీనివాస రెడ్డి, మంద సృజన, బత్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులుగా మేకల శ్రీనివాస్, బత్తుల వేణు, గోపు రాజం, మేకల సురేందర్, విద్యాసాగర్ రెడ్డి, ఎర్రబెల్లి రాజేష్, ఎల్పుల సత్యనారాయణ, కార్యదర్శులుగా నర్రా శ్రీనివాస్, పైడాకుల శ్రీనివాస్, కూనరపు శివ కుమార్, బుర్కల విక్రమ్ గౌడ్, మల్యాల బాలకృష్ణ, గంగారపు సత్యపాల్, గొల్ల మల్లేష్, బైర మల్లేశం, వేణిగళ్ల శ్రీనివాసరావు, రాపాక రాజు, కుమ్మరి సాయి కృష్ణ. సభ్యులుగా పండిన కృష్ణ, పొగుల లచ్చులు, కనుకుంట్ల కనకయ్య, నమాని కోటేశ్వరరావు, ప్రచార కార్యదర్శిగా కుర్మ సురేందర్, సోషల్ మీడియా కన్వీనర్లుగా, బొద్దుల ప్రేమ్ సాగర్, కొ కన్వీనర్‌గా గుర్రం అనిల్ కుమార్‌లకు బాధ్యలు అప్పగించారు. ఈ నూతన కార్యవర్గం పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేస్తూ, రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేస్తుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా సేవే మా ధ్యేయం – కాంగ్రెస్ పార్టీ విజయమే మా లక్ష్యం అని వారు పేర్కొన్నారు.

